క్లుప్తంగా

వరద బాధితుల కోసం విరాళం

మహబూబ్‌నగర్ న్యూటౌన్: వరద బాధితుల సహాయార్థం మహబూబ్‌నగర్ సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో రూ.50 వేల చెక్కును జిల్లాకేంద్రంలోని కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయికి అందజేశారు. ఫోరం అధ్యక్షుడు జగపతిరావు మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నిరాశ్రయులైన బాధితులకు సాయం చేసేందుకు విరాళాన్ని అందజేసినట్లు తెలిపారు. ఫోరం ప్రధానకార్యదర్శి నాగభూషణం, నారాయణరావు, రాజసింహుడు, సురేశ్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ సీజ్..



దేవరకద్ర: గోపన్‌పల్లికి గ్రామ శివారులో సోమవారం అధికారులు ఇసుక డంపును సీజ్ చేశారు. గ్రామస్తులు చేసిన ఫిర్యాదు మేరకు తహసీల్దార్ కృష్ణయ్య తన సిబ్బందితో గోపన్‌పల్లి చేరుకుని శ్రీకాంత్ అనే వ్యక్తి పొలంలో అక్రమంగా ఇసుక నిల్వ చేసినట్లు గుర్తించారు. డంపును సీజ్ చేశారు. ఎలాంటి అనుమతి లేకుండా వాగు నుంచి పెద్ద ఎత్తున ఇసుకను డంపు చేసి నిల్వ చేసుకోవడంపై అధికారులు విచారణ చేశారు. డీటీ దీపిక పాల్గొన్నారు.

ట్రాక్టర్ల పట్టివేత

మిడ్జిల్/చిన్నచింతకుంట : మండల కేంద్రంలోని దుందుభీ వాగు నుంచి సోమవారం ఉదయం అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయు డు తెలిపారు. అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

➪ చిన్నచింతకుంట మండలం నెల్లికొండికి చెందిన జి. గోవర్ధన్‌రెడ్డి ముచ్చింతల గ్రామ శివారులో సోమవారం అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసునమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్ శేఖర్ తెలిపారు.

దివ్యాంగుడిపై దాడి : కేసు నమోదు

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండలో కిరాణా దుకాణం నిర్వహిస్తున్న ఓ దివ్యాంగుడిపై అదే గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేసినట్లు ఎస్ విక్రమ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కేశయ్య దివ్యాంగుడు కావడంతో కిరాణా దుకాణం నిర్వహిస్తూ జీవిస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన శేఖర్, రాజులు కేశయ్యపై రాత్రివేళ దుకాణాన్ని మూసేస్తున్న సమయంలో అకారణంగా దాడి చేశారు. దీంతో అతడి భార్య లక్ష్మమ్మ అడ్డుకునేందుకు వెళ్లగా.. ఆమెను సైతం దూషించి అసభ్యంగా ప్రవర్తించారు. దీంతో ఆమె అరుస్తూ తప్పించుకుని ఇళ్ల మధ్యకు పారిపోయింది. ఘటనపై బాధితులు సోమవారం ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ : తొమ్మిది మందికి గాయాలు

మహబూబ్‌నగర్ క్రైం: ఎదురెదురుగా రెండు కార్లు ఢీకొట్టుకోవడంతో తొమ్మిది మందికి గాయాలు అయ్యాయి. రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్ కథనం ప్రకారం..నారాయణపేట మండల పరిధిలోని అప్పిరెడ్డిపల్లికి చెందిన శంకర్ తన కుటుంబంతో కలిసి తిరుపతి వెళ్లారు. దర్శనం చేసుకుని తిరిగి సోమవారం సాయంత్రం స్వగ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో ఓబ్లాయిపల్లి దగ్గర మరో కారు హైదరాబాద్ వెళ్తోంది. ఈ క్రమంలో రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొట్టుకున్నాయి. ఘటనలో శంకర్ కుటుంబ సభ్యులైన అనురాధ తలకు, కాళ్లకు బలమైన గాయాలు అయ్యాయి. అదేవిధంగా మూడేళ్ల మాన్విక్‌రెడ్డి, అనంతమ్మ అనే మహిళ తీవ్రంగా గాయపడ్డారు. ప్రభాకర్‌రెడ్డి, చిన్నారెడ్డి, నర్సింహులుకు స్వల్ప గాయాలు అయ్యాయి. మరోకారులో ఉన్న పాస్టర్‌తో పాటు ఇద్దరికి మూగ గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎస్వీఎస్ ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు..

రాజాపూర్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన సోమవారం మండల పరిధిలోని రంగారెడ్డి గూడ వద్ద చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. ఖానాపూర్‌నకు చెందిన పూజారి రాములు తన మోటర్‌సైకిల్‌పై బాలానగర్ నుంచి గ్రామానికి వస్తున్నాడు. ఈ మేరకు రంగారెడ్డిగూడ ఎక్స్‌రోడ్డులో వెనుక నుంచి ఓ కారు వచ్చి అతడి వాహనాన్ని ఢీకొంది. ఘటనలో పూజారి రాములుకు తీవ్రగాయాలు అయ్యాయి. దీంతో స్థానికులు చికిత్స నిమిత్తం అతడిని ఏనుగొండ ఎస్వీఎస్‌కు తరలించినట్లు ఎస్ఐ రవి తెలిపారు. అతడి భార్య లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.



మహా చండీదేవిగా పర్వతాపూర్ మైసమ్మ



చిన్నచింతకుంటలో..



చాదరపల్లిలో..



అమిస్తాపూర్‌లో..



లక్ష్మీపల్లిలో..

దుర్గమ్మకు ఘనమైన పూజలు

సాక్షినెట్‌వర్క్: జిల్లావ్యాప్తంగా నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడి శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు వనదుర్గా దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

➪ శ్రీసూర్యవంశీ ఆరెకటిక సమాజ్ ఆధ్వర్యంలో స్థానిక రామయ్యబౌలీలో ప్రతిష్ఠించిన దుర్గా మాతను సోమవారం ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి దర్శించుకున్నారు.

➪ చిన్నచింతకుంటలో గంగా భవాని ఆలయంలో ప్రతిష్ఠించిన దుర్గమాత సోమవారం పార్వతీ దేవి రూపంలో దర్శనమిచ్చారు.

➪ భూత్పూర్ పరిధిలో సోమవారం దుర్గాదేవి గాయత్రి మాతగా అలంకరించి భక్తితో కొలిచారు. పట్టణంలోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం పూజారి మంజునాథ్, అమిస్తాపూర్‌లోని సాక్షి గణపతి ఆలయంలో రవిశంకర్ పూజారి, మండలంలోని రావులపల్లిలో ప్రత్యేక పూజలు చేశారు. అమిస్తాపూర్‌లో సాక్షి గణపతి ఆలయంలో ఐదవ రోజు అన్నప్రసాద వితరణ చేపట్టారు.



వేములలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

➪ అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని గ్రామాల్లో దుర్గామాత ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

➪ పర్వతాపూర్ మైసమ్మ దేవాలయంలో సోమవారం అమ్మవారు మహాచండిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

➪ లక్ష్మీపల్లిలో దుర్గాదేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం దేవాలయంలో కుంకుమార్చన, పల్లకీసేవ, బతుకమ్మ ఆట పాటలు నిర్వహించారు.

➪ దేవరకద్ర మండల కేంద్రంలోని పోచమ్మ దేవాలయం వద్ద ప్రతిష్ఠించిన దుర్గాదేవిని స్కంద మాతగా దర్శనమిచ్చారు. అదే విధంగా కన్యకపరమేశ్వరి దేవాలయం, ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయం తదితర చోట్ల వేడుకలు కొనసాగుతున్నాయి.



మూసాపేటలో..



దేవరకద్రలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

వైభవంగా బతుకమ్మ పండుగ

రాజాపూర్: తెలంగాణలో ఆడపడచులు బతుకమ్మ పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తోందని రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డి పేర్కొన్నారు. సోమవారం రాత్రి గ్రామంలోని శ్రీలక్ష్మీ నారాయణ ఆలయ ఆవరణలో బతుకమ్మ పండుగా వైభవంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు, చిన్నారులు పాల్గొన్నారు.

కొమిరెడ్డిపల్లిలో..

అడ్డాకుల: మూసాపేట మండలం కొమిరెడ్డిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన దుర్గామాత వద్ద సోమవారం రాత్రి బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత హాజరై బతుకమ్మ ఆడారు. అదేవిధంగా దుర్గామాతకు పూజలు చేశారు.



బతుకమ్మలతో మాజీ సర్పంచ్ శశికళారెడ్డి తదితరులు



కొమిరెడ్డిపల్లిలో బతుకమ్మలతో ఎమ్మెల్యే జీఎంఆర్ సతీమణి కవిత

ది కార్జ్ ప్రారంభం



పాలమూరు: మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎస్వీఎస్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది కార్జ్ కేంద్రాన్ని స్థానిక ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి ప్రారంభించారు. అనంతరం డి కార్జ్ యాజమాని కొత్త కాపు దినేష్‌రెడ్డి మాట్లాడారు. ది కార్జ్‌లో కార్లకు సంబంధించి అన్ని రకాల సర్వీస్‌లు అందుబాటులో ఉంటాయని తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణికి ఫిర్యాదులు



దేవరకద్ర: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణిలో వివిధ గ్రామాల నుంచి నాలుగు ఫిర్యాదులు అందాయి. సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజావాణికి తగినంత స్పందన రావడం లేదు. కాగా వచ్చిన ఫిర్యాదులపై తగుచర్యలు తీసుకుని పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరావు, తహసీల్దార్ కృష్ణయ్య, పశువైద్యాధికారి రాంప్రసాద్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఓఆర్‌సీ ఉంది పట్టా అమలు చేయండి

రాజాపూర్: గతంలోనే తమకు ఓఆర్‌సీ ఇచ్చారని అట్టిభూమిని.. తమ పేర పట్టా అమలు చేయాలని సోమవారం మండల కేంద్రంలో ప్రజావాణిలో తిర్మలాపూర్ గ్రామానికి చెందిన రైతులు అధికారులకు దరఖాస్తు చేశారు. కాగా మొత్తం 8 దరఖాస్తులు వచ్చాయని వాటిని పరిశీలించి సమస్య పరిష్కారం చేసే దిశగా చూస్తామని మండల తహసీల్దార్ విద్యాసాగర్‌రెడ్డి పేర్కొన్నారు. ఎంపీడీఓ మశ్చందర్, ఎంపీఓ వెంకట్‌రాములు, ఇరిగేషన్ ఏఈ శశిధర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరు

నవాబుపేట: మండలంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 4 వినతులు వచ్చినట్లు తహసిల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు తెలిపారు. కాగా ఎంపీడీఓ, తహసిల్దార్, మిషన్‌భగీరథ శాఖల అధికారులు మినహా మిగతా వారు గైర్హాజరయ్యారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తించేలా చర్యలు

జడ్చర్ల: అర్హులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి వ్యవసాయ అధికారుల సమావేశంలో రుణమాఫీపై సమీక్షించారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో 26,662 మంది రైతులకు రూ.207 కోట్లు రుణాలను మాఫీ చేసినట్లు పేర్కొన్నారు. అయితే ఆధార్ కార్డుల నమోదులో తప్పులు తదితర కారణాలతో కొందరికి రుణమాఫీ కాలేదన్నారు. ఆయా పొరపాట్లను గుర్తించే విధంగా 10 రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని అధికారులకు సూచించారు. అదేవిధంగా ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్వాసిత రైతులకు రుణమాఫీ వర్తించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ విషయంలో న్యాయం జరిగేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఏడీఏ ఆంజనేయులు, వివిధ మండలాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



తరగతి గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తదితరులు

అదనపు గదులకు శంకుస్థాపన:

స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ సారిక, కౌన్సిలర్‌లు చైతన్య, రమేశ్, మాజీ ఎంపీపీలు నిత్యానందం, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా ఉంటాం

హన్వాడ: మత్స్యకారుల కష్టసుఖాల్లో పాలు పంచుకుంటానని.. వారికి అండగా ఉంటానని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇబ్రహీంబాద్ హేమసముద్రం చెరువులో చేపపిల్లల విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. చేపపిల్లలను కలెక్టర్ విజయేందిరతో కలిసి స్థానిక మత్స్యకారులకు పంపిణీ చేశారు. సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని భరోసా ఇచ్చారు. హేమసముద్రం నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకుందామన్నారు. ఈమేరకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేపపిల్లలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా మండల పరిధిలోని చిన్నదర్పల్లి శ్రీలక్ష్మి గోశాలలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి సీసీరోడ్డు, అదనపు షెడ్డు నిర్మాణాన్ని ప్రారంభించారు. తహసీల్దార్ కిష్ట్యనాయక్, పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, నాయకులు పాల్గొన్నారు.



చేపపిల్లలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలోని కాలనీల్లో నెలకొన్న సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం ఉదయం భగీరథకాలనీలో పర్యటించి సమస్యలను స్థానికులతో అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్పందించి పనులు చేయిస్తామన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఎ.ఆనంద్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు అధికారులు పాల్గొన్నారు.

వ్యాపారికి టోకరా వేసేందుకు యత్నం

జడ్చర్ల: ఓ గుర్తు తెలియని వ్యక్తి పట్టణంలోని ఓ వ్యాపారికి టోకరా వేసేందుకు యత్నించిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా.. పట్టణంలోని నేతాజీ చౌరాస్తాలో వ్యాపారి వంశీ రంగు డబ్బాలు అమ్మే దుకాణం నిర్వహిస్తున్నాడు. అతడికి.. 'ప్రభుత్వ దవాఖానా నుంచి డాక్టర్ సంజయ్‌ను మాట్లాడుతున్నాను. నాకు పది డబ్బాల కలర్ కావాలి. ఆన్‌లైన్ ద్వారా డబ్బు ట్రాన్స్‌ఫర్ చేస్తా' అంటూ ఓ వ్యక్తి సోమవారం ఫోన్ చేశాడు. తమ అబ్బాయి రాహుల్ వస్తాడని.. అతడి వెంట రంగు డబ్బాలు పంపాలని కోరాడు. అయితే ఇదేదో మోసంలా ఉందని గ్రహించిన వ్యాపారి తన దగ్గర ప్రస్తుతం స్టాకు లేదని ఒక డబ్బా మాత్రమే ఉందని చెప్పాడు. డబ్బా ధర ఎంత అని అడగగా రూ.2870 గా చెప్పాడు. కాగా అవతలి వ్యక్తి ఫోన్ పే చేస్తా అని ఓ సారి చెక్ చేసుకోమంటూ రూ.10 పంపాడు. డబ్బులు వచ్చాయని వ్యాపారీ చెప్పగా వెంటనే మరో మెసేజ్ రూ.28,700 లు పంపినట్లుగా వచ్చింది. దీంతో అవతలి వ్యక్తి తాను పొరపాటున ఒక జీరో ఎక్కువగా కొట్టానని.. ఒక కలర్ డబ్బా డబ్బులు పట్టుకుని మిగతా బ్యాలెన్స్ వెనక్కి వెంటనే కొట్టాలంటూ వ్యాపారిపై ఒత్తిడి తెచ్చాడు. దీంతో అనుమానం వచ్చిన వ్యాపారి తన ఫోన్ పే నుంచి డబ్బులు పంపడంలో సాంకేతిక సమస్య ఉందని.. దుకాణం దగ్గరకు వస్తే నగదు, లేదంటే చెక్ ఇస్తాను అని చెప్పి ఫోన్ పెట్టేశాడు. వెంటనే తన బ్యాంకు ఖాతాను పరిశీలించగా ఒక్క రూపాయి కూడా తన ఖాతాకు రాలేదని బ్యాంకు అధికారులు చెప్పడంతో అవాక్కయ్యాడు. ఏమాత్రం తొందరపడి డబ్బు వెనక్కి పంపినా మోసపోయే పరిస్థితి ఉండేదని పేర్కొన్నాడు.

మహిళా ఉద్యోగులకు వెసులుబాటు ఇవ్వాలి

జిడీపీసెంటర్(మహబూబ్‌నగర్): బతుకమ్మ ఉత్సవాల్లో పాల్గొనే మహిళా ఉద్యోగులకు ఒక గంట ముందు కార్యాలయం నుంచి వెళ్లేందుకు వెసులుబాటు కల్పించాలని.. టీఎస్‌జీఓ జిల్లా అధ్యక్షుడు రాజీవ్‌రెడ్డి, కార్యదర్శి చందరనాయక్, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు శ్యాంసుందరెడ్డి, కోశాధికారి కృష్ణమోహన్‌లు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టి పడేలా ప్రకృతిని ఆరాధించే పండుగలో పాల్గొనే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా దసరా కానుకగా పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు.

ఉచిత వైద్య శిబిరం



మిడ్జిల్: వేములలో సోమవారం ఆశయం హాండ్ హోఫ్ వారి సహకారంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు నిర్వాహకులు సువార్తరాజు తెలిపారు. ఈశిబిరంలో మొత్తం 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిటనట్లు వివరించారు. అవసరమైన వారికి మందులు సైతం అందజేశారని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు జంగయ్య, పాండు, భాస్కర్‌రెడ్డి, కృష్ణయ్యగౌడ్, జయరాజు తదితరులు పాల్గొన్నారు. .

బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి పరామర్శ



అడ్డాకుల: మండల కేంద్రానికి చెందిన రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు తిరుపతిరెడ్డి తల్లి పెంటమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పరామర్శించారు. పెంటమ్మ మృతిపై సంతాపం వ్యక్తం చేసి తిరుపతిరెడ్డిని ఓదార్చారు. అదే విధంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందిన మద్దూరి సత్యనారాయణరెడ్డి ఇంటికి వెళ్లిన మాజీ మంత్రి వారి కుమారులు చంద్రమోహన్‌రెడ్డి, సూర్యమోహన్‌రెడ్డిలను పరామర్శించారు. సత్యనారాయణరెడ్డి మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ జితేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీ రంగన్నగౌడ్, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, అంజనేయులు తదితరులు ఉన్నారు.

సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలి

మహబూబ్‌నగర్ న్యూటౌన్: అన్ని వర్గాల అభ్యున్నతి కోసం సామాజిక న్యాయం సాధనకై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని తంజీమే ఇన్సాఫ్ జాతీయ నేత ఎస్ఎండీ.ఫాయాజ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో జరుగుతున్న జాతీయ సమితి సమావేశాలు సోమవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమావేశాల్లో భారతీయ ప్రజాస్వామ్య పరిరక్షణ, లౌకికవాద రక్షణ కోసం నడుం బిగించి పోరాడాలని నిర్ణయించినట్లు వివరించారు. దేశంలో అనేక ప్రభుత్వరంగ సంస్థలన్నింటినీ అదానీ, అంబానీ లాంటి బడా బాబులకు అప్పగిస్తున్న కేంద్ర ప్రభుత్వ స్వార్థపూరిత విధానాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.



అభివాదం చేస్తున్న నాయకులు

దేశంలోని సెక్యూలర్ మేధావులతో కలిసి ఉద్యమించాలని సమావేశాల్లో నిర్ణయించినట్లు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం తమ వైఖరి మార్చుకోకపోతే ఉద్యమాలు తప్పవని హెచ్చరించారు. తంజీమే ఇన్సాఫ్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్లు జారీ చేయాలని విజ్ఞప్తి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సుమారు నాలుగు నెలల క్రితం పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు వెంటనే ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్లు జారీ చేయాలని.. పీఆర్‌టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ విజయేందిరను ఆమె కార్యాలయంలో కలిసి విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు వేసవి సెలవుల నేపథ్యంలో ఈఎల్స్ మంజూరు చేయాలన్నారు. స్పందించిన కలెక్టర్ ఈ సర్టిఫికెట్లు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ తెలంగాణ వనపర్తి జిల్లా అధ్యక్షుడు తలకంటి మహిపాల్‌రెడ్డి, సంఘం నాయకులు నాగరాజు, కురుమూర్తి, విజయకుమార్ పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందన

మహమ్మదాబాద్: చౌదర్‌పల్లికి చెందిన వైష్ణవి ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో ప్రథమ స్థానం నిలిచి మెడల్ సాధించింది. ఈ సందర్భంగా విద్యార్థినిని సోమవారం గ్రామస్తులు అభినందించారు. మెడల్ సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.

మోటార్‌సైకిల్ అపహరణకు యత్నం

రాజాపూర్: కుచ్చర్‌కల్‌లో సోమవారం తెల్లవారుజామున ఓ వ్యక్తి ద్విచక్రవాహనాన్ని అపహరించేందుకు యత్నించినట్లు ఎస్ఐ రవి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కావలి శ్రీను తన మోటార్‌సైకిల్‌ను తమ కాంపౌండ్‌లో పార్క్ చేసి పడుకున్నాడు. తెల్లవారుజామున ఏదో పెద్ద శబ్దం రావడంతో నిద్రలేచి చూశాడు. తన మోటార్‌సైకిల్ వద్ద కావలి ప్రవీణ్ నిలిచి ఉండడం గమనించాడు. తన వాహనాన్ని అపహరించేందుకు వచ్చాడని.. అతడిని పట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

కొనసాగుతున్న సభ్యత్వ నమోదు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలో బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) సభ్యత్వ నమోదు కొనసాగుతోంది. ఇందులో భాగంగా సోమవారం ఉపాధ్యాయులు కె.సత్యం, టి.ఇసువయ్య, ప్రసన్న లక్ష్మిలతో సంఘం జిల్లా అధ్యక్షుడు పి.చెన్నయ్య ఆధ్వర్యంలో సభ్యత్వం చేయించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కల్పదర్శి చైతన్య, గౌరవాధ్యక్షుడు వడ్డెమాన్ బాలపీర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాడం బాలశంకర్ పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై కళాజాతా



నవాబుపేట: ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలో కళాజాతా నిర్వహించారు. వెన్నెల కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో ఆట పాటలతో అలరించి ఎయిడ్స్ భూతంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రవిశంకర్, నర్సింహులు, యాదగిరి, వెంకటేష్, శమంత పాల్గొన్నారు.

నాలా కబ్జాను అడ్డుకోవాలని వినతి

నారాయణపేట: పట్టణంలోని పళ్ల బజారులో నల్ల చెరువు నాలా కబ్జాకు గురవుతోందని, దాన్ని అడ్డుకొని రైతులకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నెంబర్లు 690,699, 690/1,690/2పొలాల పక్కనుంచి నాలా వెళ్తోందని, అయితే సర్వే నెంబర్ 700,701లో రియల్ ఎస్టేట్ వ్యాపారి దినేష్ వెంచర్ ఏర్పాటు చేసి చెరువు నాలాను కబ్జా చేసినట్లు పేర్కొన్నారు. దాంతో నాలా ద్వారా వెళ్లే నీరు తమ పొలాల్లోకి వస్తోందని, ఈ విషయం ఇరిగేషన్ ఏఈ, డీఈలకు విన్నవించినట్లు తెలిపారు.